కౌశిక్‌పై దాడి రేవంత్ కుట్రే

- పట్టపగలే కాంగ్రెస్ గూండాల హత్యాయత్నం
- ఎస్కార్ట్‌తో వచ్చి అరికెపూడి దాడికి పోలీసుల సహకారం
- ప్రజాపాలనంటే ప్రతిపక్షాలపై దాడులేనా?
- కాంగ్రెస్ అరాచకాలను రాసిపెట్టుకుంటం
- ఉడుత ఊపులకు బీఆర్ఎస్ బెదరదు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడిని సీఎం రేవంత్‌రెడ్డే చేయించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. గత కొన్నిరోజులుగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తున్న కౌశిక్‌రెడ్డిని ప్రభుత్వం టార్గెట్ చేసిందని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కౌశిక్‌రెడ్డిని చంపేందుకు కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి హత్యాయత్నానికి ప్రయత్నిస్తుంటే రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉన్నదా? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచి, పోలీసుల సాయంతో వచ్చిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గూండాలు రెచ్చిపోయి దాడులకు పాల్పడ్డారని తెలిపారు. రాష్ట్రాన్ని ఫ్యాక్షనిజం, రౌడీయిజానికి అడ్డాగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కావాలనే అక్రమ కేసులు బనాయిస్తూ, హత్యాయత్నాలకు పాల్పడి బెదిరించే ప్రయత్నం చేయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఉడుత ఊపులకు బీఆర్ఎస్ బెదరదని కేటీఆర్ స్పష్టం

చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పక్కా ప్లాన్‌తోనే కాంగ్రెస్ గూండాల దాడి

వందల మంది రౌడీలు కోడిగుడ్లు, రాళ్లతో పక్కా ప్లాన్‌తోనే వచ్చి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేశారని కేటీఆర్ విమర్శించారు. పూర్తిగా ప్రభుత్వం, పోలీసుల సహకారంతో కౌశిక్‌రెడ్డిపై దాడి చేసే ప్రయత్నం జరిగిందని ధ్వజమెత్తారు. ఇలాంటి చిల్లర చేష్టలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చూస్తే జాలేస్తుందని, అక్రమ కేసులు, దాడులతో బెదిరించాలని చూస్తే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి ఉండదని హెచ్చరించారు. ప్రశ్నించేవారిపై ప్రభుత్వం దాడులకు తెగబడుతున్నదని, ఇందిరమ్మ పాలన, ప్రజాపాలన అంటే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై ప్రభుత్వమే దాడులు చేయించడమా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను రాసిపెట్టుకుంటామని హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇంతకు మించి ప్రతిఘటన తప్పదని స్పష్టంచేశారు. అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్తానన్న కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు.. అరికెపూడి గాంధీని మాత్రం కౌశిక్ రెడ్డి ఇంటికి వచ్చేందుకు ఎలా అనుమతించారని ప్రశ్నించారు.

కౌశిక్‌రెడ్డితోనే తెలంగాణ ప్రజలు: కేటీఆర్

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితోనే బీఆర్ఎస్ సహా తెలంగాణ ప్రజలు ఉన్నారని కేటీఆర్ తేల్చిచెప్పారు. కాంగ్రెస్ గూండాల దౌర్జన్యాలు, దాడులు, పిరికిపంద చర్యలని పేర్కొన్నారు. ఆ చర్యలు గులాబీ సైనికుల మనోనిబ్బరాన్ని దెబ్బతీయలేవని తేల్చిచెప్పారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా పార్టీ సైనికుల పోరాటానికి నీకు నచ్చిన పేరు పెట్టుకో' అని సవాల్ విసిరారు. తెలంగాణలోని ప్రతి అంగళాన్ని కాంగ్రెస్ అవినీతి, దుర్మార్గ పాలన నుంచి తాము కాపాడుకుంటామని చెప్పారు. బీఆర్ఎస్‌ను ఏదో చేయాలన్న భయంతో సీఎం రేవంత్‌రెడ్డి చేసే పిచ్చి పనులు.. తమ సంకల్పానికి మరింత ఆజ్యం పోస్తాయని చెప్పారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్ట్

- సీపీ కార్యాలయం వద్ద పోలీసుల ఓవరాక్షన్
- నేతలను వాహనాల్లోకి ఈడ్చిపడేసిన పోలీసులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు చేతికి తీవ్రగాయం
- హరీశ్, ప్రశాంత్, కౌశిక్‌రెడ్డితో అనుచిత ప్రవర్తన
- లోపలికి అనుమతించకుండా అడ్డుకున్న పోలీసులు
- వేలాదిగా రావాలని కార్యకర్తలకు హరీశ్‌రావు పిలుపు
- భయంతోబీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టు

కేశంపేట పోలీస్ స్టేషన్ వద్ద ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, గంగుల తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, హత్యాయత్నం కేసు పెట్టాలని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ మెట్లు ఎక్కిన బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేశారు. గుంపులుగా చుట్టుముట్టి ఒక్కొక్కరిని ఈడ్చిపడేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పట్ల పోలీసులు కర్కశంగా ప్రవర్తించారు. ఇష్టారీతిన ఈడ్చిపడేయంతో ఆయన చేతికి తీవ్రగాయమైనట్టు తెలిసింది. గురువారం సాయంత్రం 6:55 గంటలకు అరెస్టు చేసిన పోలీసులు.. కొన్ని గంటలపాటు మూడు బస్సుల్లో, పోలీసు వాహనాల్లో తిప్పారు. సాక్షాత్తూ సైబరాబాద్ కమిషనరేట్ ఆఫీసులోనే బాధితులుగా వచ్చినా తమకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ నేతలు గొంతెత్తి నినదించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలపై, ఎమ్మెల్యే గాంధీపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు మధ్యాహ్నం సైబరాబాద్ సీపీ ఆఫీసుకు వెళ్లగా.. పోలీసులు వారిని గేటు దగ్గర నుంచే నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్ఎస్ నేతలకు, పోలీసులకు వాగ్వాదం జరిగింది. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని సైతం పోలీసులు సీపీ ఆఫీసులోకి వెళ్లకుండా అడ్డుకున్నారు.

సీపీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్తుంటే..

ఎంట్రన్స్ గేటు వద్ద అడ్డగింతలు దాటుకొని సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మొహంతికి ఫిర్యాదు చేసేందుకు కమిషనరేట్‌లోకి వెళ్తుండగా బీఆర్ఎస్ నేతలను వందలాదిగా మోహరించిన పోలీసులు మరోసారి అడ్డుకున్నారు. అక్కడున్న ఓ పోలీసు అధికారి బీఆర్ఎస్ నేతలతో అనుచితంగా ప్రవర్తించారు. హరీశ్‌రావుపై చేయివేసి, బయటికి నెట్టే ప్రయత్నం చేశారు. ఆగ్రహం వ్యక్తంచేసిన హరీశ్‌రావు.. 'మరో నాలుగేండ్లలో మా ప్రభుత్వం వస్తుంది.. అంతా తిరిగి ఇచ్చేస్తాం' అంటూ వార్నింగ్ ఇచ్చారు. బాధితుడైన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సైతం అదే పోలీసు అధికారి అడ్డుకున్నారు. చేతులతో నెట్టే ప్రయత్నం చేయగా, ఇద్దరి మధ్య మళ్లీ తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. హరీశ్‌రావును సైతం పోలీసులు వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తుంటే.. 'సీపీ ఆఫీసుకు ప్రజలు రావొద్దా? ఫిర్యాదు చెయొద్దా?' అంటూ ప్రశ్నించారు. 'ఇది పబ్లిక్ ప్రాపర్టీ' అంటూ గట్టిగా అరిచి చెప్పారు హరీశ్‌రావు. వెనక్కి తగ్గిన పోలీసులు వారిద్దరిని లోపలికి అనుమతించారు. తీవ్ర వాగ్వాదాల అనంతరం మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానంద, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, అనిల్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రజని వంటి వారిని సీపీ ఆఫీసు లోపలికి అనుమతించారు.

జాయింట్ సీపీకి ఫిర్యాదు

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, అతని అనుచరులు, కాంగ్రెస్ గూండాలపై తక్షణం చర్యలు తీసుకోవడంతో, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సైబరాబాద్ జాయింట్ సీపీ జోయెల్ డెవిస్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. తాను అనారోగ్యంతో ఉన్నానంటూ సీపీ అవినాశ్ మొహంతి రాకపోవడంతో.. జాయింట్ సీపీకి ఫిర్యాదు అందజేశారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరుగుతున్న క్రమంలో ఆ పరిసరాల్లో లేకుండా పోయిన స్థానిక డీసీపీ, ఏసీపీ, సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి సహకరించిన ఇతర పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన జాయింట్ సీపీ.. తక్షణం కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. కేసు నమోదు కాకపోవడంతోపాటు అదుపులోకి తీసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలకు నార్సింగి పీఎస్‌లో సాక్షాత్తూ పోలీసులే రాచమర్యాదలు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారిని తక్షణం అదుపులోకి తీసుకొని, హత్యాయత్నం కేసు నమోదు చేసేవరకూ కదిలేదిలేదని భీష్మించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలకు, పోలీసులకు మళ్లీ వాగ్వాదం.. తోపులాటకు దారితీసింది.

కమిషనరేట్‌లోనే బీఆర్ఎస్ బైఠాయింపు

కాంగ్రెస్ నేతలపై కేసులు నమోదు చేసేందుకు సైబరాబాద్ పోలీసులు వెనకడుగు వేయడంతో.. బీఆర్ఎస్ నేతలు కమిషనరేట్‌లోనే బైఠాయించారు. ఈ క్రమంలో మళ్లీ తోపులాట జరిగింది. మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7వరకు బీఆర్ఎస్ నేతలు న్యాయం కోసం నినదించారు.

వంటావార్పుకు హరీశ్‌రావు పిలుపు

దాడి చేసినవారిపై పోలీసులు ఏ కేసులు పెట్టారో సాయంత్రం వరకూ కూడా బీఆర్ఎస్ నేతలకు స్పష్టత ఇవ్వకపోవడంతో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు వేలాదిగా సైబరాబాద్ కమిషనరేట్‌కు తరలి రావాలని, న్యాయం జరిగేంత వరకూ వంటా-వార్పు చేపట్టాలని పిలుపునిచ్చారు. అంతర్మథనంలో పడిన పోలీసులు.. ఉన్నతాధికారుల సూచనల మేరకు బీఆర్ఎస్ నేతల అరెస్టుకు రంగం సిద్ధంచేశారు. అప్పటికే కమిషనరేట్ బయట వందలాదిగా ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు లోపలికి వస్తే.. వారికి వేలాది కార్యకర్తలు తోడైతే పరిస్థితి చేయిదాటి పోతుందని గమనించి మీడియాతో మాట్లాడటం అయిపోయిన వెంటనే బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. చేతికి తగిలిన గాయంతో బాధపడుతున్న హరీశ్‌రావును దవాఖానకు తరలించకుండా పోలీసు వాహనాల్లో తిప్పడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి.

ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తున్నది?

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి విషయాన్ని పసిగట్టడంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏంచేస్తున్నది? స్పెషల్ బ్రాంచి ఎటుపోయింది? అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి అనంతరం సైబరాబాద్ సీపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రా ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోనే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి తెగబడ్డారని స్పష్టంచేశారు. 20 కిలోమీటర్ల దూరం నుంచి ఎమ్మెల్యే గాంధీ తన అనుచరులు, గూండాలు ర్యాలీగా వస్తుంటే పోలీసులు ముందస్తు అరెస్టులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దాడిని నివారించేందుకు బాష్పవాయు ఎందుకు ప్రయోగించలేదు? ఎందుకు బలగాలను మోహరించలేదు? 20 కి.మీ. పరిధిలో ఎన్ని పోలీసులు స్టేషన్లు ఉన్నాయి? ఎందుకు అరెస్టు చేయలేదు? ఇదంతా సీఎంకు తెలియకుండానే జరిగిందా? అని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడితే సీఎం ఎందుకు భయపడుతున్నాడో చెప్పాలని కోరారు. రాష్ట్రంలో పాలన పడకేసి దోపిడీ జరుగుతుందని, ఆ దోపిడీని ప్రశ్నించేవారిపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు.

దాడులకు సీఎం రేవంత్ ప్రోత్సాహం

- బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి సహా ఇటీవల బీఆర్ఎస్ నేతలపై వరుస దాడులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహం ఉన్నదని బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి విమర్శించారు. సైబరాబాద్ సీపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. నెలరోజుల వ్యవధిలోనే హరీశ్‌రావు క్యాంపు ఆఫీసుపై, ఖమ్మంలో, నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలపై, ఇప్పుడు కౌశిక్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడులకు తెగబడ్డారని తెలిపారు. ఇట్లాంటి ఘటనలతో పోలీసులపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందని చెప్పారు. మా ఓపికను పరీక్షించకండి.. తెలంగాణ ప్రశాంతంగా ఉండేందుకు మేము కట్టుబడి ఉన్నాం.. మా మరో ముఖం చూడొద్దు' అని హెచ్చరించారు.

మహిళలను దుర్భాషలాడిన గాంధీపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

మహిళలను కించపరిచేలా దుర్భాషలాడిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. తల్లిని అవమానించేలా పదే పదే ఎమ్మెల్యే గాంధీ తీవ్ర దుర్భాషలాడారని, ఇప్పుడు మహిళా కాంగ్రెస్ నాయకులు ఎక్కడికి పోయారు? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిపై కొందరు ఆంధ్రా గూండాలు పక్కా ప్రణాళికతో దాడికి యత్నించారని ధ్వజమెత్తారు. గత పదేండ్లలో ఎన్నడూ ఇలాంటివి తెలంగాణలో జరగలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇలాంటి దుర్మార్గాలను, గూండాగిరిని చూస్తున్నామని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో రౌడీ రాజకీయానికి ఆజ్యం

- బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రౌడీ రాజకీయానికి ఆజ్యం పోస్తున్నాడని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. విధ్వంసం, వినాశనం, అరాచకమే కాంగ్రెస్ ప్రభుత్వ మూల సూత్రాలు అని పేర్కొన్నారు. పదేండ్లు ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో 10 నెలలు గడవకముందే మళ్లీ పాత రోజులను తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ గూండారాజ్!

మొదటిపేజీ తరువాయి...

విధానం! పార్టీ మారనేలేదన్న అరికెపూడి గాంధీకి.. మరి అలాంటప్పుడు గులాబీ కండువా కప్పుకోమనడం తప్పుగా తోచింది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ కాంగ్రెస్ పెద్దలకు ఆగ్రహం తెప్పించింది. అసలే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టులో పిటిషన్ వేసిన కౌశిక్‌పై పీకలదాక ఉన్న కోపం.. పీఏసీ పదవితో బయటపడింది. మొదట హౌస్ అరెస్టు అంటూ బలగాలను దింపి కౌశిక్‌ను ఇంటికే పరిమితం చేశారు. కొద్దిగంటల్లోనే పోలీసులను తగ్గించి.. దాడికి రంగం సిద్ధంచేశారు. కూకట్‌పల్లి నుంచి కొండాపూర్ దాక 9 కిలోమీటర్లు మందీమార్బలంతో అరికెపూడి బయల్దేరినా పోలీసులు చూడనట్టే ఉండిపోయారు. వరుస వాహనాలతో ఫ్యాక్షన్ లీడర్ తరహాలో కాన్వాయ్ బయల్దేరితే.. అదేదో దండయాత్రలా కాకుండా 'గాంధీ- దండి యాత్ర'లానే పోలీసులు చూస్తుండిపోయారు. చివరకు పాడి ఇంటిమీద రాళ్లదాడి జరుగుతున్నా పట్టనట్టే వ్యవహరించారు. తరుచూ రాజ్యాంగం చేతపట్టుకుని ప్రజాస్వామ్య విలువలు ప్రబోధిస్తూ కనిపిస్తున్న కాంగ్రెస్ అధినాయకుడిని, నేతలను కలిసేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లిన సమయంలోనే ఇక్కడ ఎమ్మెల్యేపై దాడి జరిగింది! ఎవరి ఆదేశాల మేరకు?



కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసేందుకు పలు వాహనాల్లో వెళ్తున్న రౌడీ దండు

చివరికి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడూ బీఆర్ఎస్ నేతలపై అరాచకాండ కొనసాగింది. సైబరాబాద్ కమిషనరేట్‌లోకి వెళ్లకుండా పోలీసులే అడ్డగించారు. హరీశ్ సహా మాజీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నా లోనికి అనుమతించలేదు. దీంతో నేతలంతా అక్కడే మెట్లపై బైఠాయించారు. అరికెపూడిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని నినదించారు. రెండు గంటలపాటు ఆందోళన కొనసాగుతున్నా ఉన్నతాధికారులను కలిసేందుకు అనుమతించలేదు. అధికారులూ అక్కడికి వచ్చి వారికి హామీ ఇచ్చే ప్రయత్నం చేయలేదు. చివరకు వాళ్లందరినీ ఈడ్చుకెళ్లి వాహనాల్లో బయటకు తీసుకెళ్లారు. రెండు బస్సుల్లో వేర్వేరు రూట్లలో తీసుకెళ్తూ.. మూడు గంటలపాటు రోడ్లపైనే తిప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లోకి తీసుకెళ్తున్నారన్న సమాచారంతో తెలంగాణవాదులు, బీఆర్ఎస్ అభిమానులు ఆందోళనకు గురయ్యారు. రోడ్ల పైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేశంపేట, తలకొండపల్లిల్లో వందలాదిమంది స్థానికులు అడ్డుకోవడంతో పోలీసు వాహనాలు నిలిచిపోయాయి. వాహనాలను కదలనివ్వని జనం.. వాటి టైర్లకు నిప్పుపెట్టారు. ప్రజలను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జికి దిగారు. 'సీఎం డౌన్ డౌన్..' 'రేవంతరెడ్డీ ఖబర్దార్' అన్న నినాదాల మధ్య.. బీఆర్ఎస్ నేతలను కేశంపేట స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్‌లో అరెస్టు చేసిన నాయకులను రంగారెడ్డి జిల్లాలోని మారుమూల ఠాణాకు తీసుకెళ్లడం వెనుక ఏ ఒత్తిళ్లు పనిచేశాయి? గాంధీని అరెస్టు చేసి నార్సింగి స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు.. స్టేషన్ బెయిల్ ఇచ్చి 'మర్యాదగా' ఇంటికి పంపారు. దాడిపై చర్యలు తీసుకోవాలన్న బీఆర్ఎస్ నాయకులను జిల్లాలు తిప్పుతూ తీసుకెళ్లారు. పోలీసుల దురుసు ప్రవర్తనలో హరీశ్ సహా పలువురు నేతలు గాయపడ్డారు. పరిస్థితి చేయిదాటుతుండటం, ప్రతిఘటన తీవ్రమవుతుండటంతో పోలీసులు వెనక్కి తగ్గారు. బీఆర్ఎస్ నేతలను బేషరతుగా విడుదల చేశారు.

వాళ్లను అడ్డుకోవద్దు?

- దాడి వెనుక పెద్దల ఆదేశం..
- పోలీసుల తీరుపైనా అనుమానాలు

గురువారం ఉదయం కౌశిక్‌రెడ్డి ఇంటివద్ద బందోబస్తులో పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దాడి వెనుక పెద్దల హస్తం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి ఆదేశాల మేరకే పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారన్న చర్చ జరుగుతున్నది. ఎమ్మెల్యే గాంధీ నివాసం వివేకానందనగర్ నుంచి 9 కిలోమీటర్ల దూరంలో కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంటికి మధ్యలో 8 జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఉన్నాయి. కానీ.. ఎక్కడా 20 వాహనాల ఆ కాన్వాయ్ ఆగలేదు.. పోలీసులూ అడ్డుకోలేదు. గేటెడ్ కమ్యూనిటీలోకి వాహనాలు చొచ్చుకొస్తున్నా, ప్రధాన గేటుపైకి ఎక్కి, తన్నుకుంటూ వీరంగం సృష్టించినా, రాళ్లు విసిరినా పోలీసులు పెద్దగా అడ్డుకున్నట్టు కనిపించలేదు. 2గంటల బీభత్సాన్ని సృష్టించినా పోలీసులు స్పందించలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం దాడి వెనుక ప్రభుత్వ పెద్దలు, పోలీస్ ఉన్నతాధికారుల హస్తం ఉన్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'వాళ్లను అడ్డుకోవద్దు' అని ఆదేశాలు ఇవ్వడం వల్లే కాన్వాయ్ 20 నిమిషాల్లోనే కౌశిక్‌రెడ్డి ఇంటికి చేరిందని అంటున్నారు. ఆ ఆదేశాలు ఎవరు ఇచ్చారన్న చర్చ పెద్దఎత్తున జరుగుతున్నది. దాడిపై ముందుగానే సమాచారమున్నా ఇంటెలిజెన్స్ వర్గాలు గప్‌చుప్‌గా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్ గూండాలపై హత్యాయత్నం కేసుపెట్టాలి

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి తెగబడిన కాంగ్రెస్ గూండాలపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ దాడికి సహకరించిన స్థానిక పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. సైబరాబాద్ సీపీ ఆఫీసు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయాలని చెప్పారు. 20 కిలోమీటర్ల దూరం నుంచి కార్ల కాన్వాయ్‌లో ఓ ఎమ్మెల్యే తన అనుచరులతో దాడి చేసేందుకు వస్తుంటే.. ఏ ఒక్కరూ కూడా ఎందుకు ఆపలేదో చెప్పాలని ప్రశ్నించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలకు పోలీసులు కుర్చీల్లో కూర్చోబెట్టి, టీలు, బిర్యానీలు తెప్పిస్తూ.. రాచమర్యాదలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతుందని, నిందితులను బయటికి వదిలిపెట్టడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. ఈ తరహా దాడులను సీఎం నియంత్రించాలని, మేధావులు ఈ చర్యలను ఖండించాలని కోరారు.

పోలీసుల వైఫల్యమా? ప్రభుత్వ ప్రోత్సాహమా?

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి పోలీసుల వైఫల్యమా? ప్రభుత్వ ప్రోత్సాహమా? అనేది నిగ్గుతేల్చాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు, గాంధీని భారీ కాన్వాయ్‌తో ఎలా అనుమతించారని ప్రశ్నించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రతిపక్షంలోనే ఉంటే బీఆర్ఎస్ కండువా కప్పుకోవాలని సూచించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరింది నిజమేనన్న విషయం ప్రజలందరికీ తెలుసని, పీఏసీ పదవి రావడంతో ప్రతిపక్షంలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారని తెలిపారు.

ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే దాడి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పాడి కౌశిక్‌రెడ్డిపై ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే దాడి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. పక్కా ప్రణాళికతోనే కాంగ్రెస్ జరిపిన విద్రోహ చర్య అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో రౌడీ పాలన కొనసాగుతుందని విమర్శించారు. అరికపూడి గాంధీ స్వయంగా కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారని, పీఏసీ చైర్మన్ పదవి కోసం నాటకాలు ఆడుతున్నాడని ధ్వజమెత్తారు. పీఏసీ చైర్మన్ పదవి అనవాయితీని తుంగలో తొక్కి నీతిమాలిన రాజకీయానికి సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపారని విమర్శించారు.

కౌశిక్‌రెడ్డిపై దాడి ఉన్మాద చర్య

- బీఆర్ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి ఉన్మాద చర్య అని శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. భౌతికదాడులు చేయడం దారుణమని పేర్కొన్నారు. దాడిచేసిన ఎమ్మెల్యే గాంధీ మీద, అతని అనుచరుల మీద తక్షణం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రోత్సహించిన పోలీసులను తక్షణం సస్పెండ్ చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. దాడి చ